ఆచార్య నారాయణస్వామి

వేసవికాలపు సెలవులు ప్రారంభం కాగానే ఆచార్య నారాయణస్వామి స్వభావంలో గాంభీర్యం చోటుచేసుకోవడం మామూలు. మిత్రులను కలుసుకోవటానికి కూడా సందేహిస్తాడు చాలా తక్కువగా మాట్లాడుతూ ఉంటాడు. సాయంకాలపు వేళల్లో ఎక్కడికి వెళ్ళేది సామాన్యంగా ఇంట్లో కూడా చెప్పడు.

ప్రతి సంవత్సరమూ ఏదో ఒక యూనివర్సిటీ నుంచి దిద్దటానికని పరీక్షా పత్రాలు వస్తూనే ఉంటాయి. ఆయన పరీక్షా పత్రాలు దిద్దటంలో ఒక నిర్దిష్టమైన పద్ధతిని అవలంబిస్తాడు. రోజుకు నలభై పత్రాలకంటె ఆయన దిద్దడు అంతకంటె ఎక్కువ దిద్దినట్లయితే విద్యార్థులకు న్యాయం చేకూరదని ఆయన నమ్మకము. ఎంత అనుభవజ్ఞులయినా మొదటి పదిహేను ఇరవై పత్రాలు స్థిమితంగా చూడగలరు గాని - ఆ తరువాత ఏదో ఒక విధమైన తొందరపాటు తప్పకుండా కలిగి విద్యార్థులకు అపకారం జరుగుతుందని ఆయన విశ్వాసం.

ఆయన తన బాధ్యతను ఎంత కచ్చితంగా నెరవేరుస్తాడంటే ఆ పరీక్షా పత్రాలు దిద్దటం పూర్తయ్యే వరకూ మరోపని తలపెట్టడు. ఆ సమయాలలో ఇంటికి బంధుమిత్రు లెవరు వచ్చినా ఆయనకు చాలా చికాకుగా ఉంటుంది. ఎవరు వచ్చినా వాళ్ళు తనను మార్కులు వెయ్యమని అడగటానికి వచ్చినట్లే అనుమానం కలుగుతుంది. అందుకని ఆయన పరీక్షాపత్రాలు చేతికందిన రెండు మూడు రోజులకు దూరంగా ఉన్న ఊళ్ళకు వెళ్ళి అక్కడ మంచి హోటల్లో ఉండి పనిపూర్తి చెయ్యటం అలవాటు.

ఆయనకా సంవత్సరం ఊటీ వెళ్లాలని దృఢంగా సంకల్పం కలిగింది. కాని - ఎందువల్లనో కూనూరు కూడా చల్లగానే ఉంటుంది కదా అని అక్కడికి వెళ్ళి ఒక హోటలు దగ్గరగా గది తీసుకున్నాడు. ఉదయం కాఫ్యాదులు ముగించుకున్న తరువాత కొన్ని పత్రాలు, ఓకునుకు తీసిన తరువాత ఓ కప్పు కాఫీ తాగి మరికొన్ని పత్రాలూ దిద్దటం ప్రారంభించేవాడు.

కూమారు వచ్చిన తరువాత మొదట రెండు రోజులూ ఊళ్ళో ముఖ్య ప్రదేశాలు చూసి - ఏది ఎక్కడుందో గుర్తుపెట్టుకుని తనపని ప్రారంభించాలని అనుకున్నా మరో రెండు రోజులకు గాని మనసు అటువైపుకు మళ్ళలేదు.

తరువాత తీరికగా పెట్టె తెరచి పేపర్లన్నీ బయటికి తీసి లెక్కపెట్టుకున్నాడు. రోజుకు ఎన్నిదిద్దాలో విభజన చేసుకున్నాడు.

ఆ పేపర్లన్నీ అట్లా పేర్చి పెట్టుకొని అనాటి పత్రికను తిరగవేసి డాక్టరుస్వామి ఎర్రపెన్సిలు తీసుకుని పేపర్లు దిద్దటము మొదలు పెట్టాడు.

ఒక అరగంట అయిన తరువాత చూసిన పేపర్లను తిరిగి పెట్టెలో భద్రపరచి మళ్ళీ క్రొత్తవి అందుకున్నాడు.

మూడు గంటల సుమారుకు గది తలుపు చప్పుడయింది. ఆయన త్వర పాటుతో లేచి దిద్దిన పేపర్లు పెట్టెలో పెట్టి ఇంకా చూడవలసిన వాటిమీద ఖద్దరు తుండువా కప్పి ఎప్పటినుంచో తాను పత్రిక చదువుకుంటున్నట్టుగా చేతపట్టుకొని తలుపుతీశాడు. ఎవరు తలుపుకొట్టుతున్నారో - ఎందుకు కొట్టుతున్నారోనని సందేహిస్తున్న ఆయనకు కాఫీ టిఫిను తెచ్చిన సర్వరును చూడగానే మనసు కుదుటపడ్డది. తెచ్చిన వస్తువులందుకొని తలుపు మూసుకున్నాడు.

సాయంత్రము అయిదు గంటలవరకూ ఆ విధంగానే పేపర్లను దిద్దుతూ - లెక్కపెట్టుకునేసరికి ముప్పయ్యే అయినట్లు తేలింది. వాటిని విడివిడిగా పెట్టెలో సర్ది జాగ్రత్తగా పెట్టెకు తాళమువేసి తాళపుచేతులను కోటుజేబులో భద్రపరచుకున్నాడు.

ముఖం కడుక్కొని చలవ ధోవతీ సిల్కు కుడతా ధరించి కాళ్ళకు ఆకు చెప్పులతో బయలుదేరబోతూ తీరా మనసు కేమి తట్టిందో - ఆ కుడతావిప్పి - షర్టు తొడుక్కొని దానిపైన కోటు వేసుకున్నాడు. గదికి గట్టి తాళము వేసి చల్లగాలికి పార్కువరకూ వెళ్ళాలని కాలినడకనే బయలుదేరాడు.

పార్కులో పచ్చగడ్డిమీద ఒంటరిగా విశ్రాంతిగా అరగంట కూర్చునేసరికి విసుగుపుట్టింది. లేచి చెప్పులు వేసుకుని అటూఇటూ చూసేసరికి ఎదురుగా ఉన్న భవనంలోకి అందరూ గుంపులు గుంపులుగా పోతున్నారు. వాళ్ళతోపాటు ఆయనా

లోపలికి వెళ్ళి బల్లముందర కూర్చుని గోడలకు తగిలించబడిన నాయకుల చిత్రాలను చూస్తూ ఉండగా రెండుసార్లు సర్వరువచ్చి ''ఏం కావా''లని అడిగి వెళ్లాడు తీరా బల్లముందర కూర్చుని ఏమీ వద్దంటే తన మర్యాదకే భంగమనుకొని షర్బతు తీసుకురమ్మన్నాడు

అంతలో గుంపులు గుంపులుగా ఆడవాళ్ళూ మగవాళ్ళూ వచ్చి అక్కడ ఉన్న కుర్చీలు ఆక్రమించుకున్నారు. అందులో ఒకామె ధైర్యంగా వచ్చి డాక్టరు స్వామి బల్లదగ్గర కూర్చుని సర్వరును పిలిచి తనకు కావలసినదేదో ఆర్డరుచేసింది. ఇదంతా ఆయన షర్బతు త్రాగి గ్లాసు బల్లమీద పెట్టే అంతలో జరిగింది. ఆమె నిస్సంకోచంగా తొందర తొందరగా తినటము మొదలు పెట్టింది. ఆమె తన కెదురుగా కూర్చోటంవల్ల ఆయనకు మొగమాట మనిపించి తన దృష్టిని గోడల మీద ఉన్న చిత్రాలపైకి పోనిచ్చి చేతి కర్రను తిప్పుతూ కూర్చున్నాడు. అయిదు నిమిషాల తరువాత సర్వరు రాగానే బిల్లు చెల్లించి అక్కడి నుంచి కదిలి వెళ్లి పోయాడు. చల్లగాలికి లానులో విశ్రమించాలనిపించి చెప్పులు విడిచి కూర్చున్నాడు

డాక్టరు నారాయణస్వామి భార్య ఇప్పటి తరహా మనిషి కాదు కాపురానికి వచ్చినప్పుడు ఆ కాలానికి తగినట్టుగానే ఆమె వేషధారణ ఉండేది. తరువాత తరువాత సంసారములో కూరుకుపోయి-పిల్లలతో సతమతమవుతూ ఉండటంవల్ల ఆమెకు తన వేష భాషలను తిరిగి తిరిగి కాలానుగుణ్యంగా మార్చుకోవటానికి అవకాశం చిక్కనేలేదు. అదిగాక కాన్పుల సంఖ్య ఎక్కువైన కొద్దీ మనిషికాస్త స్థౌల్యానికి లోబడిపోయింది. డాక్టరు స్వామి ముగ్గురు పిల్లలు పుట్టిన తరువాతనే విదేశాలకు వెళ్లి పిహెచ్.డి. డిగ్రీ తెచ్చుకున్నాడు ఆయన విద్యా సంస్కారమూ నాగరికతా ఆయన వరకేగాని కుటుంబానికి చెందలేదు. కారణం ప్రత్యేకంగా ఎత్తి చూపటానికి ఏమీ కనబడదు. పిల్లలతో ఉదయాస్తమానమూ వేగిపోయే భార్యను ఆయన ఏ విషయానికీ తొందర పెట్టదలచడు. తన గదినీ తన వస్తువులనూ తన పుస్తకాలనూ తానే స్వయంగా చూసుకుంటాడు. తన గదికి తాళము వేసుకుంటాడు. ఒక్కొక్కసారి ఆయన తన ప్రోగ్రాములను ఆమెకు తెలుపనైనా తెలుపడు.

డాక్టరు స్వామి అయినా మరీ ఆధునిక వేషంలో ఉన్న స్త్రీ లంటే ఏవగించుకుంటూనే ఉంటాడు. బుగ్గలకూ పెదవులకూ రంగులు పూసుకునే వాళ్లంటే ఆయన అదొక వింతగా చూస్తాడు. ఎర్రటి పొడుగుపాటి గోళ్లను

చూడగానే దూరంగా జరుగుతాడు. కాని ఆ టేబుల్ దగ్గర కూర్చున్న ఆమెకు మాత్రం రూపం తక్కువైనా చక్కని దిద్దుబాటున్నది అదిగాక - ఆయనను ఆకర్షించింది ఆమె చొరవతనము. ఆమె ఒంటరిగా బయటికి వచ్చి ధైర్యంగా తిరుగుతుంటే ఆయనకు చూడముచ్చటైనది.

ఆయన మనసు అకస్మాత్తుగా భార్యవైపుకు మళ్లింది ఆమెకు పాపం-ఆయన అభిరుచులను అడిగి తెలిసికోవటానికి కూడా తీరుబడిలేదు. ప్రపథమంలో ఆయనకు ఆమెను తనతో ఎక్కడికయినా తీసుకుని వెళ్లాలని ఉండేదిగాని-పిల్లలతో ఆమె పడే యమయాతనకు వెరచి తన కోరికను తనలోనే లయింప చేసుకునే వాడు. అలా కొంతకాలము అయేసరికి అసలు ఆ కోరిక కూడా నశించిపోయింది కాని-ఎప్పుడయినా ఆయనకు నచ్చిన వేషధారణ ఏ స్త్రీ దగ్గరనయినా కనబడితే-పాపము-ఆప్యాయంగా చూస్తాడు. కొత్త వాళ్లను పలుకరించాలని - అభినందించాలనీ ఆయన రహస్య కుతూహలము.

భావ పరంపర ఆయన మెదడులో అలా సాగిపోతూ ఉండగా ఆయన కెదురుగా టేబుల్ దగ్గర కూర్చున్న ఆమె ఒయ్యారంగా కొంగుచేత బట్టుకొని-మెట్లు దిగి-లాను మీదుగా గేటు వైపు దారితీసింది.

ఆమె అలా వెళ్లిన తరువాత-ఆయన ఎంతో సేపు అక్కడే కూర్చున్నాడు. ఎనిమిది గంటలయినట్లుగా గడియారము ఏ మూలనుంచో గంటలు కొట్టింది అక్కడినుంచి బయలుదేరి కాలినడకతో తిన్నగా గదికి చేరుకున్నాడు.

తన గది పరిసరాలను చూసిన తరువాత ఆయన దృష్టి అప్పటికి ఆమె వైపు నుంచి మళ్లి-పేపర్ల మీదికి ప్రసరించింది

అక్కడ ఉన్న మొదటివారంలో చాలా వరకు అయన అనుకున్నట్లు పేపర్లను దిద్దగలిగాడు. అయన దగ్గరికి పేపర్లు పోతాయంటేనే విద్యార్థులందరూ భయపడుతూ ఉంటారు. విద్యార్థులు వ్రాసిన జవాబులను తాను యివ్వదలచిన మార్కులతో సరిసమానముగా తూచి యివ్వటమేగాని అరమార్కయినా ఎక్కువ ఇవ్వటం ఆయన స్వభావంకాదు. ఎంత రహస్యంగా ఉంచినా పరీక్షకు లెవరో విద్యార్థులకు తెలిసిపోతూనే ఉంటుంది. పరీక్షలయిన దగ్గర్నుంచీ విద్యార్థులూ వారి పక్షాన పెద్దవాళ్లూ పరీక్షకుల ఇళ్ల చుట్టూ తిరగక మానరు. మామూలుగానే

డాక్టరు స్వామి విద్యార్థులతో చనువుగా మాట్లాడడు. అందులో పరీక్షకుడయితే చెప్పనే అక్కరలేదు ఆ సంవత్సరం విద్యార్థులందరూ ఆయన పేరు వినంగానే ముఖాలు దించుకున్నారు. అన్నీ తెలిసినవాళ్లు కూడా "నాలుగు మార్కులు వెయ్యటానికి వీలుందా" అని అడిగితే ఆయనకు చాలా అసహ్యమనిపిస్తుంది. "దొంగతనం చెయ్యటానికి వీలుందా" అన్నట్టు వాళ్ల మాటలలో ధ్వనించేది.

ఆయన ఈ సంవత్సరము పరీక్ష పేపర్లు చేతికి వచ్చిన తరువాత అమ్మాయికి సంబంధం చూస్తానని ఇంట్లో చెప్పి వేసవి సెలవులలో కొంతకాలము కూనూరులో గడపదలచి ఎవరికీ తెలియకుండా వెళ్లాడు. వెళ్లినచోట కూడా తానెక్కడినుంచి వచ్చినదీ సాధ్యమైనంతవరకూ ఎవరికీ తెలియకుండా కాలక్షేపం చేస్తున్నాడు.

ఒకరోజు సాయంకాలము పార్కులో లానుమీద కూర్చున్నాడు. పేపర్ల బరువు తీరితేగాని-కాస్త నలుగురితో మాట్లాడి తన ఒంటరితనాన్ని పోగొట్టుకునేటట్టులేదు ఎక్కడ కూర్చున్నా ముళ్ల మీద కూర్చున్నట్టుగానే ఉంటున్నది.

ఆయన మనసులో ఆకస్మికంగా ఆమె మెదిలింది. ఆమె పార్కులో ఎక్కడా కనిపించటంలేదేమి? ఎందువల్ల? రెండు రోజులయినట్లుంది. అప్పుడే ఆయన పార్కంతా కలయదిరుగుతూ ఏమీ తోచక తన గది చేరుకుంటున్నాడు.

ఆ రోజు మాత్రం ఆమె విషయము ఆయన మనసులోకి రాగానే తమాషాగా ఆమె ప్రత్యక్షమైనది. నల్లచుక్కల ఎర్రటి నైలాన్ చీరె కట్టుకున్నది. దానికీడైన రవిక తొడుక్కున్నది. జారు ముడిమీద నాలుగంటే నాలుగే పూలు పెట్టుకున్నది. కనబడీ కనబడని బొట్టు అంజన రహితమైన కన్నులు-తీర్చిదిద్దిన అలంకరణ ఆయనకు చాలా ముచ్చట గొలిపింది. ఆమె ఒయ్యారంగా నడుస్తూ వచ్చి పచ్చి గడ్డిమీద కూర్చుని-అటూ ఇటూ చూసినట్లే చూసి చేతి సంచిలో ఉన్న ఊలు స్వెట్టరు బైటికి తీసి అల్లటం మొదలు పెట్టింది. అస్తమించబోతున్న సూర్యుడు తన పసిడి కిరణాలను విరజిమ్ముతూ ఉంటే ఆ కాంతిలో ఆమె ముఖం తళతళ మెరిసిపోయింది.

ఆయన కళ్లు జిగేలుమన్నాయి. నాలుగుసార్లు చూడటంవల్ల ఆయన కండ్లకు ఆమె బాగా పరిచయమయిపోయింది. ఆమె నాజూకైన వేషధారణా-ఆమె చొరవ

దనమూ ఆయన మనసును బాగా ఆకర్షించినందువల్ల ఆయన హృదయంలో ఆమె అంటే ఎంతో ఆప్యాయత ఏర్పడ్డది వాచికంగా పలకరించకపోవటమే బాహ్య పరిచయానికి ఆటంకంగా ఉన్నది. దానివల్లనే వారిద్దరిమధ్య పరిచయము ముందుకు సాగకుండా అక్కడికే నిలిచిపోయింది. డాక్టరు స్వామి మీనమేషాలు ఎంచుతూ ఉండగానే క్రమంగా చీకటి పడి ఎనిమిది గంటలు కావచ్చింది.

ఆమె చివాలున లేచి తన సామానులన్నీ సంచిలో పెట్టుకుని మెల్లగా నడవటం ప్రారంభించింది. ఆమె అలా నాలుగు బారల దూరము వెళ్లిన తరువాత ఆయన కూడా లేచి చెప్పులు వేసుకుని బయలుదేరాడు.

పార్కు నుంచి ఒక్కటే రోడ్డు-తిన్నగా బయలుదేరి సరిగ్గా డాక్టరు స్వామి గారి గదికి సమీపంగా రోడ్డు మలుపు తిరిగే వరకూ ఒకరి వెనుక ఒకరు ఇద్దరూ నడిచారు. ఆమె ఆ మలుపు దగ్గర సందులోకి వెళ్లబోతూ ఉండగా ఆయన నోటి వెంట అప్రయత్నంగా "మీ యిల్లు ఈ సందులోనేనా?" అన్నమాట వచ్చేసింది.

ఆమె వెనక్కు తిరిగి చూసి తెల్లటి పళ్లను పైకి కనబరుస్తూ "మీది కూడా ఇక్కడేనా?" అన్నది ఒయ్యారంగా తల ఆడిస్తూ. ఆమె ఆ మాట అంటుంటే ఆయన కెంతో ముచ్చటనిపించింది.

"ఆc! ఇక్కడే-ఈ గదే. మనము చాలా దగ్గరగానే ఉన్నాము. సులభంగా కలుసుకోవచ్చు" అని ఆయన అంటూ ఉండగానే ఆమె తలఆడిస్తూ వెళ్లిపోయింది.

పరీక్షలో గెలుపొందినంతటి ఆనందంతో డాక్టరు స్వామి మనసు గంతులు వేస్తూ ఉండగా ఆయన తన గదిని చేరుకొని ద్విగుణీకృతమైన ఉత్సాహంతో పేపర్లు దిద్దుకొని ఆ రాత్రి హాయిగా నిద్రపోయాడు.

మరునాడంతా ఆయన పేపర్లు దిద్దుతూనే గడిపాడు. సుమారు నాలుగు గంటల తరువాత లేచి బయటికి బయలుదేరాలని త్వర త్వరగా పనిచేసుకోవటం మొదలు పెట్టాడు.

అంతలో గది తలుపు చప్పుడయింది. ఆయన ఆదుర్దాతో లేచి ఇద్దరు ఇండువా పేపర్ల మీద కప్పేసి పైకి ఏమీ కనబడటం లేదన్న నమ్మకం చిక్కిన

తరువాత-తలుపు తీశాడు. సర్వరు కాఫీ తెచ్చాడేమో ననుకున్నా డాయన. కానీ తీరా తలుపు తెరచిన తరువాత ఆమె కంటపడగానే దిగ్భ్రాంతుడయిపోయాడు ! ఆమె తన గదికి వస్తుందని ఆయన కలలోనయినా అనుకోలేదు. మొత్తంమీద సాహసమే చేసిందనుకొని "రండి రండి" అన్నాడు.

ఆమె గడపలో నిలువబడే "నేను బజారుకు పోతూ పోతూ మీ గది ఇక్కడనేమోనని-ఊరికేనే తలుపుతట్టాను. వెళ్లి వస్తాను. కొంచెము బజారుకు వెళ్లవలసిన పని ఉన్న''దంటూ ఒయ్యారంగా కులుకుతూ అన్నది.

"నేనూ వస్తాను. నా పనీ అయింది. బజారుకు వెళ్లాలని నేనూ అనుకుంటూనే ఉన్నాను. లోపలికి వచ్చి అట్లా కూర్చుంటే నేను సిద్ధమవుతాను"-అంటూ రెండు తలుపులూ తెరిచి ఆమె లోపలికి రాగానే ఒక తలుపు వేశాడు. ఆమెను అక్కడున్న కుర్చీలో కూర్చోమని చేతితో సైగచేసి-తానొక కుర్చీలో కూర్చున్నాడు.

"ఎండా కాలమని యిక్కడికి వచ్చారా? ఈ ఊరు చాలా బాగుంటుందని అందరూ అంటుంటే నేను కూడా చూద్దామని వచ్చాను. రోజూ కొంత దూరము నడిస్తేగాని నాకు అన్నం అరగటంలేదు ఈఊళ్లో" అన్న దామె నాలుగు మూలలూ చూస్తూ.

"నడవకపోయినా నాకు ఆ బాధేమీ కనబడలేదు. ఈ ఊరు ఎట్లాఉంటుందో చూద్దామని వచ్చినవాడినే నేనూను. పది రోజులలో వెళ్లిపోవాలి" అన్నాడు వేలి ఉంగరము చూసుకుంటూ.

"అయితే మీది ఏ ప్రాంతం?" నోరు విప్పీ విప్పకుండా ప్రశ్నించిందామె. ఆమె పెదవులు గులాబీ రేకులు కదిలినట్లు కదిలాయి.

ఆయన తాను చెప్పదలచుకోని దాన్ని బ్రహ్మకయినా చెప్పకుండా ఉంచగలడు. "మాది ఉత్తర ప్రదేశము. ఎండలు యిక్కడ గడిచిపోతే విశ్రాంతిగా ఎక్కడికయినా వెళ్లవచ్చు" అన్నాడు ఎటోచూస్తూ.

"ఔత్తరాహులు సాధారణంగా డార్జిలింగు వెళ్లుతారేమోగా ! మీరింత దూరం వచ్చారేమీ?'' అన్నది మళ్లీ నవ్వుతూ.

ఆదివరలో ఆయన-ఆమె నాజూకుతనానికీ-చొరవదనానికి మురిసిపోయాడు. దీనితో ఆమె తెలివిగలదని కూడా అర్థమైంది. దీని తరువాత ఆయనకు ఆమెమీద మురిపెము మరీ ఎక్కువయింది.

ఇద్దరి సంభాషణా హిందీలో నడుస్తున్నది. భాషలోని జాతీయత - స్ఫుటమైన ఉచ్చారణ-ఆమె మాటల్లో చక్కగా కనబడుతున్నది. దానికి ఆయన మరింత మురిసిపోయాడు.

అంతలో తలుపుచప్పుడయింది. డాక్టరు స్వామి లేచి నిలబడి-షర్టుసర్దుకొని తీరా తలుపు దగ్గరికి వెళ్లేసరికి తటాలున ఒక విషయం స్ఫురించింది. అక్కడే ఆగిపోయాడు. ఉన్నవాడు ఉన్నట్టుగా అవతలికి వెళ్లితే-తన గదిలో పరాయి స్త్రీని చూసిన ఆ వ్యక్తి తనను గురించి ఏమనుకుంటాడు ? తనను గురించి ఏమైనా అపోహలు పడితే ? పోనీ ఆమె కనబడకుండా తలుపు దగ్గరికి వేద్దామా అంటే మూర్తీభవించిన ఆయన నిజాయితీ అంతా ఆ పేపర్లను విలువ కట్టడంలోనే ఉన్నది. ఆ పేపర్లు పెట్టెలోనయినా కాకుండా విడివిడిగా ఖద్దరు శాలువ క్రిందపడి ఉన్నాయి. ఆయన పని ఇరుకున పడినట్లయింది. బాగా ఆలోచించే వ్యవధయినా లేదు. అంతలో బయట నిలువబడిన వారెవరో మళ్లీ తలుపు చప్పుడు చేశారు.

"ఆడది ఆ పేపర్లను ఒక వేళ చూసినా ఏం చెయ్యగలదు? ఆమెకేం తెలుస్తుంది? ఊరికే తన భయంగాని !" డాక్టరు స్వామి మనసును నెమ్మది పరచు కొని-మెల్లగా తలుపులు దగ్గరగా వేసి-బయటికి వెళ్లి చూశాడు. ఎవరో కొత్త వాడనుకొన్నాడు గాని, తీరాచూసేనరికి-ఆయన బాగా తెలిసినవాడే-సాటి పరీక్షకుడు.

"మీరు ఇక్కడికి వచ్చి ఎన్నాళ్లయింది?"-అడిగా డాయన.

"అబ్బే ! ఎన్నాళ్లో కాలేదు. నిన్ననే అనుకోండి" అన్నాడు తల తడుముకుంటూ.

"అయితే ఈ వేసవికాలమంతా ఇక్కడే గడుపుతారా?" అన్నాడాయన.

"ఊఁహూఁ ! నేను రెండు రోజులలో వెళ్లిపోవాలి" అన్నాడు డాక్టరు స్వామి.

ఆ తరువాత నిలువబడే మరోఅయిదు నిమిషాలపాటు ఇద్దరూ మాట్లాడారు. మరునాడో-మూడవనాడో తిరిగి కలుసుకుందామనుకున్నారు.

ఆయనను పంపించి లోపలికి వచ్చిన డాక్టరు స్వామి దృష్టి ముందు పేపర్ల పైన పడ్డది. అవి యథాపూర్వకంగా ఇద్దరు కాలువ క్రిందనే ఉన్నాయి ముడతలు లేకుండా ఆయన కప్పినట్టుగానే బట్టకప్పి ఉన్నది. తరువాత ఆయన దృష్టి ఆమె పైన ప్రసరించింది. ఆమె కూడా కాలైనా కదిలించినట్టులేదు. తాను వెళ్లేటప్పుడు ఎట్లా కూర్చున్నదో అట్లాగే కూర్చుని పత్రికలో ఉన్న బొమ్మలను చూస్తూ పుటలు తిరుగవేస్తున్నది.

ఆయన తన కుర్చీలో కూర్చుంటూ–"ఎవరో తెలిపిన ఆయనే వచ్చాడు. ఎవరూ తెలియని ఊళ్లో నాలుగు రోజులుండిపోదామని నేను ఇంతదూరం వచ్చాను. లేకపోతే మీరు చెప్పినట్టుగా ఏ డార్జిలింగో వెళ్లకపోయినానా?" అన్నాడు. తరువాత ఇద్దరూ లేచారు. తనకు కావలసిన బట్టలేవయినా పెట్టెలో నుంచి తీసుకుంటే పేపర్లు ఆమె కంటబడతాయేమోనని-అలాగే చెప్పులతో బయలుదేరి గది తాళం భద్రంగా వేశాడు.

ఆమె మొదట ఆయనతో అన్నట్లుగాను-ఆయన తనకు కూడా ఏదో పని ఉన్నదన్నట్లుగాను బజారువైపు వెళ్లటం ఇద్దరూ మరచినట్లున్నారు. తిన్నగా పార్కు వైపు నడచి-రెస్టారెంటులోకి వెళ్లి చెరి ఒక డ్రింకు తీసుకున్నారు.

లానులో కూర్చుని అయిదు నిమిషాలపాటు పిచ్చాపాటి మాట్లాడుకున్నారు. ఊలు స్వెట్టరు కుట్టటము దాని పొందిక-అందము-ఆమెకున్న శ్రద్ధను అభిరుచులను పొగడటము డాక్టరు స్వామి మరవలేదు. చీకటి పడేవరకూ ఉండి తరువాతఇద్దరూ లేచారు. దారి పొడుగునా సినిమాలను గురించీ డ్యాన్సులను గురించీ ఏవేవో మాట్లాడుకున్నారు, నవ్వు కున్నారు. చివరకు ఇద్దరూ చీలిపోయే సమయంవచ్చింది. "రేపు కలుసుకుందామని" ఇద్దరూ ఒక్కసారే బయటికి అనేశారు ఉత్సాహము కొద్దీ. ఆ మరునాడు డాక్టరు స్వామి మామూలుగా కాకుండా భోజనానికి ముందూ తరువాత కూడా ఇనుమడించిన ఉత్సాహముతో పేపర్లు దిద్దగలిగాడు.

ఆ సాయంకాలము ఆమె వచ్చేవరకూ తన పని చూసుకుని తరువాత బయటికి బయలుదేరి పోవాలని ఆయన సంకల్పించుకున్నాడు.

సాయంకాలము అయిదు....ఆరు గంటలు కూడా దాటిపోతున్నాయి. ఆమె జాడేలేదు. పాపం డాక్టరు స్వామికి చీమ చిటుక్కుమన్నా ఆమె వచ్చినట్లే లని పిస్తూ వచ్చింది.

చీకటి పడిన తరువాత ఆయన పేపర్లన్నిటినీ సర్దుకొని గది తలుపులు వేసి-పార్కు వైపు బయలుదేరి వెళ్లాడు ఆమె కోసం దారి పొడుగునా ఆయన కళ్లు వెదకుతూనే ఉన్నాయి. ఆమె రాని లోపము ఎంతైనా కనబడ్డదాయనకు, మనసంతా అదొక మాదిరిగా అయిపోయింది. అవ్యక్తమయిన బాధ ఏదో ఆయనను బాధించటము మొదలుపెట్టింది.

రాత్రి తొమ్మిది గంటలవరకూ లానులో తిరిగి-చివరకు గది చేరుకున్నాడు. ఆ రాత్రి ఆయనకు ఏ పనీ చేయబుద్ధి పుట్టలేదు.

ఆ మరునాడు మూడవనాడూ కూడా ఆమె కనబడలేదు. ఆయనకు మొదటి రోజున కలిగిన బాధ తరువాత కలుగలేదు. ఆమెను చూడగానే తనకు తెలిసిన వారెవరికంటా పడలేదు. ఇంకా నయము! కనుక దానిని అంతటితో విస్మరిద్దామనుకున్నాడు

డాక్టరు స్వామి స్వస్థానం చేరుకున్న తరువాత ఒకనాడు సినెమాకు వెళ్లాడు. విరామ సమయాన వెలిగిన దీపాల వెలుగులో కూనూరులో కనబడిన ఆయన-ఆమె ఒక్క వరుసలోనే ఇద్దరు మగపిల్లల మధ్య కనబడ్డారు. ఆయన తన కుటుంబాన్ని డాక్టరు స్వామికి పరిచయం చేశాడు. డాక్టరు స్వామి పూర్వాపరాలను జ్ఞప్తికి తెచ్చుకునే లోపల దీపాలు ఆరిపోయాయి.

ఆమె.... ఆయన భార్య ?

ఆ పిల్లలు ఎప్పుడో ఒకసారి తన దగ్గరికి వస్తే బాగా చీవాట్లు వేసి పంపిన జ్ఞాపకమున్నది డాక్టరు స్వామికి. తాను నిర్మొగమాటస్థుడని తెలిసి ఆ దంపతులు చేసిన పనా ఇది! తాను పడిన జాగ్రత్త కొద్దీ సంశయము కలుగలేదు గాని-ఇప్పుడాలోచించి చూస్తే రెండు పేపర్లలో ప్రతి సమాధానానికీ + వేసి మార్కులు కలిపింది తాను కాదు! ఆ నాడు ఆ దంపతులిద్దరూ ఒకరు గదిలో-ఒకరు బయటా ఉండి ఎంత నాటకమాడారు

అదంతా తలచుకున్న తరువాత ఆయనకు ఒక్క నిమిషమయినా అక్కడ ఉండబుద్ధి పుట్టలేదు. చివాలున లేచి థియేటరు వదలి వెళ్లిపోయాడు-పెదవులు విరుచుకుంటూ.

(ఆంధ్ర దిన పత్రిక)